# ఆదర్శ వివాహం

"కట్నం పుచ్చుకునే విద్యావంతుని కన్నా పుచ్చుకోని విద్యాహీనుడు మిన్న" అని కాలేజీ మేగజైన్‌లో కవిత రాసింది బియ్యే ఫైనల్ చదివే ఆదర్శ.

బియ్యే పూర్తయేక పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు పితృదేవుడు.

తను రాసిన కవితని నిజజీవితంలో అమలు చేద్దామనే దీక్షతో ఉండి, తండ్రిని నొప్పించకుండా ఒప్పించి, పత్రికా ప్రకటన చేయించింది ఆదర్శ.

"అధికారం కాదు కావల్సింది అనురాగం
హోదా కాదు కావల్సింది హుందా
అంతస్తు కాదు కావల్సింది అంతరంగం
ఆస్తికాదు కావల్సింది ఆస్తికత
కులం గురించి మాత్రం వ్యాకులం వద్దు ఇటువంటి సరసహృదయుని కోసం చూస్తూంది -ఆదర్శ- బియ్యే - 160-సెం.మీ-ఇరవయ్యేళ్ళు - రాయండి బాక్స్ నం. 24, భాగ్యనగరం."

పై అర్హతలన్నీ తనకున్నాయని నమ్ముతున్న శ్రీహర్ష- రాష్ట్ర ప్రభుత్వ చిరుద్యోగి- జూనియర్ అసిస్టెంట్ - ఎస్.ఎస్సీ. మాత్రమే - 165 సెం.మీ- 1200 - పాతికేళ్ళు- దరఖాస్తు చేశాడు.

శ్రీహర్షని ఆదర్శ వివాహం చేసుకుంది ఆదర్శ. బంధుమిత్రులు హర్ష వర్షాన్ని కురిపించారు. అత్తారింట్లో అడుగుపెట్టింది ఆదర్శ.

"ఏమండీ శ్రీవారూ! మనిద్దరి ఆదర్శం నెరవేరింది. కాపోతే మనింట్లో కొన్ని ముఖ్యమైన వస్తువులు లేవు. మీరు అనుమతిస్తే మా నాన్నగార్నడిగి

కొన్ని వస్తువులు తెస్తాను." అంది ఆదర్శ.

"శ్రీమతీ! మనం ఉన్నదాంట్లో ఎలాగో సర్దుకుపోదాం. నా ఆదాయం చిన్నదని తెలిసి కూడా- శ్రీమంతుల బిడ్డవి- నాకు అర్ధాంగివి కావడానికి సమ్మతించావు. నువ్విప్పుడు మీ తండ్రిగార్నడిగి ఏవైనా వస్తువులు తెస్తే - నేన్నిన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నా వస్తురూపేణా కట్నం డబ్బు వసూలు చేశాననే అపప్రథ నాకు వస్తుంది. అంచేత ఆ ప్రయత్నం విరమించుకో" అన్నాడు శ్రీహర్ష.

"మీరు మా నాన్న నడిగి వస్తువులు తెమ్మని నన్నేం వేధించలేదు కదా, నలుగురూ మిమ్మల్ని విమర్శించడానికి? నా అంతటనేను మా పుట్టింటి నుండి సారె తెచ్చుకున్నానని, మా 'ఆదర్శ మహిళా మండలి'లో చాటిచెబుతాను! కాదనకండీ, ప్లీజ్!" అంది గోముగా.

శ్రీహర్ష కాదనలేకపోయాడు. "నీ ఆనందమే నా ఆనందం. నీ ఆదర్శమే నా ఆదర్శం. కానీ, అయితే" అన్నాడు.

"థాంక్యూ డాలింగ్" అంటూ భర్తకి ఓ కిస్ పారేసి పుట్టింటికి బయలుదేరింది ఆదర్శ.

మర్నాడు ఒక లారీ నిండా గృహోపయోగకర విలాస వస్తువులు పట్టుకొచ్చింది ఆదర్శ. కలర్ టీవీ, గోద్రెజ్ ఫ్రిడ్జ్, స్టీలు బీరువా, డైనింగ్ టేబులు, కాల్‌గాస్‌స్టౌ, సోఫాకం బెడ్, ప్రెషర్ కుక్కర్, వాషింగ్ మెషీను, స్కూటరూ లారీలోంచి దిగాయి. ఇదికాక విద్యుత్తు నిరంతరాయంగా ప్రవహించడానికి వీలుగా మినీ జెనెరేటర్ సెట్టు కూడా తెచ్చింది తనతో.

అయినా సరే తాను ఆదర్శ వివాహమే చేసుకున్నా నంటుంది ఆదర్శ- తన భర్త శ్రీహర్ష ఇవేవీ తెమ్మని కోరలేదన్నది నిజమే. ఆదర్శ తెచ్చిన విలాస వస్తువులు, తను కోరకపోయినా తెచ్చి తీరుతుందని శ్రీహర్ష నమ్మకం! ఎందుకంటే శ్రీమంతుల బిడ్డ పేదవాని ఇంట్లో గడుపుకోలేదు కనుక! తను ఒకవేళ వేరొక అమ్మాయిని కట్నంతోనే వివాహం చేసుకున్నా ఆ కట్నం విలువ ఆదర్శ తెచ్చిన వస్తువుల విలువకన్నా బహుస్వల్పం! తన కా విలాస వస్తువులు కావాలనే కోరిక ఉన్నా - తను బయట పడకుండా - ఈ లోగుట్టు పెరుమాళ్ళకి తప్ప

ఇంకెవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డాడు శ్రీహర్ష. కాపోతే పది రూపాయల కరెంటు కార్డు అరవై రూపాయలకి దేకింది.!

• ఆంధ్రప్రభ వీక్లీ •
*14-1-1987*